# పేకాటలో ఆంధ్రరాష్ట్రం

తోట వెంకటాద్రి

రాజయ్యా: సరే లెస్తూ! యిందులో పెద్ద లచ్చలు బోయినట్లు మాట్లాడతావ్!

అప్పయ్యా: లచ్చలేంటి లచ్చలు? వట్టాలే యింత కష్టంగా ఉంది. ఇహ నిన్నేసుకుని డబ్బాట కూర్చుంటే రెండుచేతులా జుర్రుకున్నట్లే. అసలు నీకు టీం స్పిరిటేదిరా రాజయ్యా?

రా: ఏం జేశానోయ్ నేను? మహా నువ్వు...

అ: ఏంజేశానేంటి? తురుపులన్నీ పడిపోయింతర్వాత నీచేతికొచ్చిందిగదా! ఆటీనాసు హుకుంగదా! ఆ ఆసు నాడకుండా రాణీ నాడితివి. పెంటయ్యా ఒంటిరాజుకు పట్టుబోయె. ఆటయిందాకా మళ్ళీ మన చేతికి పట్టు రానేలేదయ్యో.

రా: రెండుపట్లు తీద్దామని రాణీ నాడేశే. రాజు వాడిదగ్గరుందని కలగన్నానా! నీదగ్గరుందనుకున్నా.

అ: అది సరే! ఇందాక నా మణేలా పట్టుమీద ఆ కళావరు త్రించానెయ్యకుండా యేడు పాడి నొకదాన్ని తగలబెడితివి. మణేలా మందేనన్న సంగతి నీకు తెలుసుగందా! త్రించాను మడిసి ఎక్కడ బెట్టుకున్నావ్ వెయ్యకుండా?

రా: ఏడ్చావు లెస్తూ! నువ్వు పెద్ద పాడి చేసిన ఆటగాడి మాదిరి.

అ: అరే! నే నాటగాణ్ణి అవుదును, కాదు. ఇప్పుడెందుకది? అయితే యేముక్క యెక్కడుందోకని పెట్టి ఆడక్కర్లా? ఎవరేం వేస్తున్నారో చూడక్కర్లా? తత్తిమ్మా వాళ్లు యెట్లా ఆడతున్నారో గ్రహించక్కర్లా? యిన్ని ఓకులు మనమీద యెక్కినయ్యే; ఇవన్నీ తీర్చాలన్న ఆలోచనుండక్కర్లా? ఊరక గుడ్డెద్దు చేలో బడ్డట్లు ఆడితే యెట్లా?

నరసయ్యా: ముక్క బడందే యెంతాటగాడయినా యేంజేస్తాడు లెస్తూ! నీదంతా అరవగోలగాని.

అ: ముక్కబడందే అంటే! ఈ ఆట యెటువంటిదని? మణేలా రాజూ, పాడిమీద అడ్డు జెప్పినా చంకనాకిపోయె. సరిగ్గా ఆడితే యెందుకు పోతుందో చెప్పూ!

పెంటయ్యా: కలపరా ఇహ చాలుగాని నీ...

అ: కలపాల్సిందే! అబ్బాయి నే నొకటి చెబుతున్నా: ఇట్లా ఆటలు పోగొడుతుంటే నే నాడేదిలేదు. తెగేసి చెబుతున్నా యిప్పుడే, యెందుకు పొద్దాక?

రా: నే నసలాడను పో! నీపక్క నాడితే యెప్పుడూ యింతే! (అంటూ లేస్తాడు)—

పెం: కూర్చో రాజయ్యా కూర్చో! వాడి మాటల కేమొచ్చెగాని... (అంతలో అక్కడికి సూరయ్య వస్తాడు)

రా: ఇంకేం? సూరయ్య నేసుకుని యేడ్చుకోండి. నేం బోవాలి, పనుంది.

న: పోదుగాని లే కూర్చో!

సూరయ్యా: యేంటి మీ అరుపులూ మీరున్నా? బజార్లోకి వినబడుతుంటే!

పెం: అప్పయ్య ఆటలో ఉంటే అరుపులకేం తరుగు?

సూ: ఆంధ్రులన్నందుకు మొత్తానికి ఊరక పోనియ్యాడంలా.

అ: యేమయింది ఆంధ్రులయితే ఇప్పుడు!

న: వాళ్లలో వాళ్లు తగాదాలు పడ్డానికి ఆంధ్రులది పెట్టింది పేరని వారభిప్రాయంగాని, కలుపు కలుపు! కూర్చో సూరీ వాడివైపున.

అ: అంతేనా సూరయ్యా?

సూ: కాకపోతే ఇంకేంటి? మనలో ఐక్యత యెక్కడేడ్చింది?

అ: నే నొప్పుకోను. అయితే ఒక్క ప్రశ్న. యీ అనైక్యత ఆంధ్ర మహా జనుల్లోనంటావా లేక ఆంధ్ర మహా నాయకుల్లో నంటావా?

పెం: అందరట్లాగే తగలబడ్డారు గాని-

కలుషిక కలుపు! లేకపోతే పేకిటులే నేం గలుపుతా. కొత్తాట్టేద్దాం మళ్ళీ.

అ: యిది చాలా తప్పు అభిప్రాయం పెంటయ్యా! ఆంధ్ర ప్రజానీకంలో ఐక్యత లేదనే విషయం నే నొప్పుకోను. ప్రజానీకాన్ని పిలవండి ప్పుడు. తమ లక్ష్యాలను సాధించుకో డానికి సుసంఘటితులై, నిర్మాణయుక్తంగా పోరాడ తారు. ఆంధ్రులు బ్రిటిషు సామ్రాజ్యవాదంతోనూ, భూస్వామ్య పెట్టుబడీదారీ విధానాలతోనూ, వీరోచితంగా వెనుదీయక పోరాడి ఘన విజయాల్ను సాధించారు. ఉదాహరణలు వందలకొలది యివ్వొచ్చు.

సూ: మనలో ఐక్యత ఉంటే ముప్ఫయి యేండ్లనుంచి తపస్సు చేస్తున్న మన రాష్ట్రం మనకు రాకుండా ఉంటుందా?

అ: అది ప్రజల తప్పుగాదు. ప్రజలకు నాయకత్వం వహించే నాయకుల తప్పు. నాయకుల్లో ఐక్యత లేదన్నావ్, నే నొప్పుకున్నా దాన్ని. మన నాయకుల్లో ఐక్యత నిప్పచ్చరం అనేది వివాద రహితమైన పరమసత్యం. దీన్ని కొదనటానికి గుండె లెవ్వరికీ లేవు. అసలు వీరికి లక్ష్య శుద్ధి అనేది ఉంటేకదూ, ఆ లక్ష్యం మీద యేకీభవించి అంతా కలిసి ఐక్యంగా పని చేయడానికి! వీరంతా స్వార్థపూరితులై, ఏ విధానాన్ని అనుసరించయినాసరే వ్యక్తిగతంగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోడానికే పాటుబడుతున్నారు. దీన్నే యిండివిడ్యుయల్ ప్రైవేటు క్యారీరిజం అంటాం యేదో ఒక విధంగా ప్రజా విశ్వాసాన్ని చూరగొని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, ప్రజా క్షేమాన్ని కొలవన్ని, ప్రజా ద్రోహాన్ని తలపెడుతూ నాయకులనిపించుకొంటున్న హేమాహేమీలు మన ఆంధ్ర దేశంలోనే కాదు, ప్రతి రాష్ట్రంలోను ఉన్నారు. ఒక్క ఆంధ్ర నాయకుణ్నే నవ్వు వేలుబెట్టి చూపించ నవసరం లేదు. నీ యిష్టం వచ్చిన రాష్ట్రాన్ని తీసుకో చూద్దాం.

సూ: అదేరా నే నసేది, మనలో ఐక్యతే ఉంటే యెప్పుడో రాష్ట్రం వచ్చేది.

పెం: కాబట్టే స్వామి సీతారాం ప్రాణ మొప్పం జెప్పుకున్నాడు వెంకటప్పయ్యా! పాపం దానికీ యెన్నో గుంట చిక్కు లొచ్చె.

ఉ: వినోబాజీ సలహా పాటించి తన దీక్ష విరమించుకున్నాడు గాని, ఆ దెబ్బలో స్వామి గల్లంతయ్యేవాడే.

పెం: మన ఈ సమస్యలు యెందరి ప్రాణాలను బలిగొంటాయిరా అప్పయ్యా!

అ: అందులో ఆశ్చర్యంలేదు పెంటయ్యా! "ఒక లక్ష్యం సాధించుటలో జరిగిన నరకంతా లెన్నో". సమాజంలో ఓం ప్రథమంగా శ్రమ విభజన అనేది జరిగిన నాటనుంచీ, చరిత్రంతా పీడక పీడితుల మధ్య పోరాటంగా మారి పోయింది. ప్రజా జీవితం కేవలం త్యాగమయమైపోయింది. రానురాను యిహ యిప్పుడీ పెట్టుబడి దారీ వ్యవస్థలో వర్గచైతన్యం పొందిన పీడితులు సహజమైన తమజీవితాల్ని సౌఖ్యంగా జీవించడానికి, పీడకులతో యెట్లా వీలుగా ఉంటే అట్లా అన్ని రంగాల్లోనూ తలపడుతున్నారు. చిట్ట చివరకు పీడితులు జయించి తీరుతారనేది చరిత్ర చెబుతున్న సత్యం.

సూ: యేమోనబ్బ! నేటి మన దుస్థితి తలుచుకుంటే నాకేడుపొస్తుంది. "బానిసల దేశమా! ఓ భరత దేశమా! కరకు రాళ్లయినా కరుగు నీ కథ విన్న" అని చిన్నప్పుడు ఓ పాట విన్నట్లు జ్ఞాపకం. యిప్పుడా పాటను తిప్పి, "బానిసల దేశమా! ఓ ఆంధ్ర దేశమా" అని పాడాలనిపిస్తోంది.

వ: నిజమే సూరయ్యా!

పెం: ఆంధ్ర దేశంలో ఆంధ్రులకే ఉద్యోగాలు లేవయ్యా. ఏం చెయ్యాలి?

రా: "ముక్కలు ముక్కలై చెదిరి పోయెనురా మన జాతి." నా అభిప్రాయంలో మన యావదాంధ్ర దేశం నవాబు కింద ఉన్నా యిప్పట్లో ఒకందుకు మేలుగా ఉండేది. యేమంటావ్ అప్పయ్యా? కాశ్మీరు మాదిరి...

అ: అట్టా అయితే మనం మళ్ళీ రెండు వందల సంవత్సరాలు వెనక్కు వెళ్ళి, చరిత్రనంతా తారుమారు చేసుకురావాలి. అది సాధ్యం గాదనే విషయం అందరికీ తెలిసిందే.

రా: మొన్న మా ఆఫీసులో యేమయిందంటే, పాకిస్తాన్ పంజాబునుంచి శరణార్థిగా వచ్చిన ఓ గుమాస్తా మీదే రాష్ట్రం అన్నాడు. నాకు నిజంగా కళ్ళవెంబడి నీరు తిరిగిందనుకో.

"అయ్యా నేను ఆంధ్రుణ్ణి లేక తెలుగువాణ్ణి" అని చెప్పి, "మాది అనధికార ఆంధ్ర రాష్ట్రం అధికార పూర్వక మద్రాసురాష్ట్రం" అన్నా. అతనెప్పుడూ ఆంధ్ర, తెలుగు అనే పేర్లు విన లేదట. నాకాశ్చర్యం వేసింది. తరవాత ఓ గంటసేపు పూసగుచ్చినట్లు చెప్పాలే, మన చరిత్రంతా. కాలకర్మవశాత్తు యిట్లా అయ్యాం అని నిట్టూర్పు విడిచా. దానికతను పాపం చాలా సానుభూతి కనబర్చాడు. యూరప్ ఖండంలో మన రాష్ట్రం కన్నా వైశాల్యం లోనూ, జన సంఖ్యలోనూ చిన్నవైన దేశాలు (?) సర్వ స్వతంత్ర ప్రతిపత్తి ననుభవిస్తున్నాయి. దాదాపు పాతిక జిల్లాల భూభాగం కలిగి, మూడు కోట్ల జనసంఖ్యతో, భారతదేశంలో రెండవ స్థానాన్ని ఆక్రమిస్తున్న మన ఆంధ్ర ప్రాంతానికి యే ప్రత్యేకతా లేకపోవడం చూశావ్ నాకు...

పెం: నీకేంటి అందరికీ అట్లాగే ఉంది.

సూ: మనం మాత్రం కేవలం దద్దమ్మలై పోయినాం.

న: యిప్పుడేమోగాని సూరయ్యా! పూర్వ కాలం మనాంధ్రదేశం అపూర్వ వైభవోన్నతితో వర్ధిల్లిందటరా!

పెం: అదేమిటి నీ తలకాయ! మనం మగధ సామ్రాజ్యాన్ని ఆక్రమించుకొని, పాలించిన కాలం వుంది. ఒకప్పుడు వింధ్య పర్వత దక్షిణ భాగాన్ని కన్యాకుమారి వరకూ, మన పిడికిట్లో బిగించుకొన్న కాలం ఉంది. అజేయులైన మన ఆంధ్ర వీరుల చరిత్రలు వర్ణనాతీతాలు.

రా: నలందా విశ్వ విద్యాలయం ప్రిన్సిపాలు మన ఆంధ్రుడేనట.

న: నాగార్జునాచార్యులు ఆంధ్రులు.

పెం: విజయనగరం బజార్లలో నవరత్నాలు రాసులు బోసి అమ్మేవారట మన ఆంధ్రులు.

సూ: కాకతీయుల నాటి మన కథలు వింటే కడుపు తరుక్కుపోదురా!

పెం: మన నన్నయ.

న: మన తిక్కన.

రా: మన పోతన.

పెం: మన శ్రీనాథుడు.

న: మన అష్ట దిగ్గజాలు.

రా: సంగీతానికి పనికివచ్చే భాష తెలుగుకి మించింది యింకోటి లేదట.

పెం: అందుకనే, మన భాషను పాశ్చాత్య పండితులు "ఇటాలియన్ ఆఫ్ ది యీస్టు" అని ప్రశంసించారు.

న: మన త్యాగరాజును మించిన సంగీత విద్వాంసు డెక్కడ వున్నాడురా.

రా: మన క్షేత్రయ్యా; మన భరత నాట్యం వగైరాలు...

సూ: నిజంగా ఆనాటి మన ఆంధ్ర వీరత్వం ఆంధ్ర కళా వైదగ్ధ్యం ఆంధ్ర విభవోన్నతి, ఆంధ్ర ప్రభ, ఆంధ్ర ప్రతిభ, యిప్పుడు మచ్చుకైనా ఉన్నాయా?

అ: కొంచెం ఓపిక పట్టండి మిత్రులారా కొంచెం ఓపిక పట్టండి!

సూ: ఇంకేం ఓపిక నీ మొహం ఓపిక!

అ: "పటు బహుబలులైన ఆంధ్రుల గత ప్రాశస్త్యముల్ వల్లె వేయుటలో కొన్ని తరాలు దాటినవి, పూర్వోదంతముల్ నేటి సంకటముల్ దీర్పవు," కాబట్టి ప్రస్తుత పరిస్థితులకు సరిపోయే గట్టి కార్యక్రమం చేసుకుని తదనుగుణంగా పనిచేయాలిప్పుడు.

సూ: ఆ! యేం కార్యక్రమమో యేమో! అద్యతన భావిలో ఆంధ్ర రాష్ట్రం యేర్పడుతుందన్న నమ్మకం నాకు లేదు.

న: ఎన్నికలయింతర్వాత తప్పదని మొన్న యెవరో అన్నారటనే.

సూ: అన్నారు, విన్నాం. యీ అనటాలు యిదివరకే లక్షా తొంభైతొమ్మిది సార్లయింది. అది వచ్చిందాకా నమ్మటానికి వీల్లేదు.

రా: విశాలాంధ్ర సమస్య అటుంచి, వివాద గ్రస్తంగాని ప్రాంతంలోనన్నా రాష్ట్రం ఏర్పాటు చేస్తే యేదో గుడ్డిలో మెల్లగా ఉండేది.

పెం: దానికెంత తగాదా యేడ్చిందనీ! ఆంధ్రరాష్ట్రం కావాలని యే ముహూర్తాన తీర్మానించారో కాని, అన్నీ అడ్డంకులే వచ్చి. అదుగో వచ్చినట్లుంటుంది. మరు క్షణం అంతా అయోమయం.

న: యింకో సంగతి: మొత్తం భారతదేశం అంతా ఒకే జాతి అనీ, దాన్ని విచ్ఛిన్నం

చేయగూడదనీ, భాషాధారక రాష్ట్రాలుగా దేశాన్ని విభజిస్తే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందనీ, దేశ శాంతి భద్రతల దృష్ట్యా, రక్షణ దృష్ట్యా, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా, ఆలోచించినట్లయితే, భాషాధారక రాష్ట్రాలు నిర్మితం గాకపోవడం మంచిదని సోషలిజంలో నమ్మకమున్న మన నాయకులే హెచ్చరిస్తున్నారు.

నూ: యేడ్చావ్! పరిపాలనా సౌలభ్యం కోసం ఉత్తర సర్కార్లను ఒరిస్సాలోనూ, రాయలసీమను బొంబాయిలోనూ కలపమను. యింకో కమ్మంగా ఉంటుంది.

న: యిప్పుడుమాత్రం అంతకన్నా మెరుగ్గా ఉండి చచ్చిందేంటని?

అ: కొంచెం ఆగండి! మిత్రులారా కొంచెం వినండి. ఒక ముఖ్య విషయం చెబుతా. అసలీ రాష్ట్ర సమస్యను యెట్లా పరిష్కరించాలనో వివరిస్తా. యేంటంటే భారత దేశమంతా ఒకే జాతి అనే వాదం విమర్శకు ఆగదు. భారతదేశం కొన్ని జాతుల కూటం. అసలు జాతి అంటే యేమిటి? దీన్ని అనేకులు అనేక విధాలుగా నిర్వచించారు. మనం యిప్పుడీ సమస్యను స్టాలినిస్టు దృక్పథంనుంచి పరిశీలిద్దాం. జాతి అని యెవరిని అంటారు? వినండి చెబుతా: ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే ఆర్థిక జీవనం, ఒకే మనస్తత్వంకలిగి, ఒకే ప్రాంతంలో నివసించే ఒక ప్రజాసమూహాన్ని జాతిఅంటారు. ఈ లక్షణాలు కలిగిన జాతులు భారతదేశంలో ఉన్నయ్యా, లేక ముప్పైకోట్ల భారతీయులందరికీ పై లక్షణాలను వర్తింపజేసి వీరందరినీ ఒకేజాతి అనడానికి వీలుందా? ఏమాత్రం లేదు. భారత దేశాన్నంతా ఒకేజాతి అనే వాదం అసలు జాతి సమస్యను వెనక్కి నెట్టేస్తుంది. ఆసేతు హిమాచల పర్యంతంగా నివశిస్తున్న భారత ప్రజలు వేలకొలది సంవత్సరాలుగా జరుగుతూ వస్తున్న సమాజ పరిణామదశలో నేటికి, చారిత్ర్యాత్మకంగా పై జెప్పిన లక్షణాలతో, ఆంధ్ర, తమిళ, కన్నడ, కేరళ, మహారాష్ట్ర, గుజరాతు, బెంగాలు, ఒరిస్సా, అస్సాం, బీహారు పంజాబు, మొదలయినటువంటి జాతులుగా రూపొందారు. అంటే భారతదేశం కొన్ని నిశ్చిత జాతులకూటం అన్నమాట. మనకు తెలియని చిన్న చిన్న జాతులు యింకో ఉండవచ్చు. యూరపు ఖండంగూడా యిట్లాంటి కొన్ని జాతులు కూటమే. వారందరినీ ఒకేజాతి అని పిలుస్తున్నామా? అయితే ఆ జాతులు స్వతంత్రమైన తమతమ దేశాల్లో నివసిస్తున్నయ్. మనం అంటే మన భారతజాతులు అస్వాభావికంగా విభజింపబడిన, అభాషా ప్రయుక్త రాష్ట్రాల్లో నివసిస్తున్నాం. అటువంటప్పుడు "బాబూ! మా రాష్ట్రాన్ని మాకు ప్రత్యేకించండి. అది మా ప్రజల జన్మహక్కు. మమ్మల్ని మేం పాలించుకుంటూ, మా బాగోగుల్ని మేం చూసుకుంటాం" అంటే అది రాష్ట్రీయ దురభిమానం అవుతుందా?

న: అని వాళ్ళంటున్నారు.

అ: ఎవరు మన నాయకులా? తిమ్మిని బ్రహ్మిని, బ్రహ్మిని తిమ్మినిజేస్తూ, కల్లబొల్లి కబుర్లు చెబుతూ, సంతృప్తికరంగా ఏ సమస్యా పరిష్కరించ చేతగాని మన నాయకులు అట్లా అనడంలో ఆశ్చర్యంలేదు. బూర్జువాలు యితర జాతుల ప్రయోజనాలను తృణీకరిస్తారనేది సిద్ధాంతం ఇహ యీ జాతుల సమస్య యెట్లా పరిష్కరింపబడాలి? ఒక్కసారి సోవియట్ రిపబ్లిక్కులను స్మరించండి. అధునాతన ప్రజాస్వామ్య పద్ధతులమీద ఆ జాతుల సమస్య యెంత నేర్పుగా, ఎంత నిష్కాపట్యంగా పరిష్కృతమయిందో ఊహించండి. ప్రపంచంలో యేదేశంలోగూడా లేని అభివృద్ధిని గాంచుతున్నాయి ఆ జాతులు. మన జాతి సమస్యను గూడా సోవియట్ అనుభవాన్ని ఆధారంగా తీసుకొని పరిష్కరించుకోవాలి. ప్రతి జాతికీ స్వయం నిర్ణయాధికారం ఉండాలి. ఇట్టి అధికారంలేందే యేజాతీ అభివృద్ధి పొందనేరదు. ఈ జాతులన్నీ ఓ సమాఖ్యగా యేర్పడి, ఒకదానిపక్కన ఒకటి సోదర. సమరస, స్నేహభావాల్తో మెలగుతూ ఉండాలి. అప్పుడే జాతుల సమస్య పరిష్కారం అవుతుంది. అప్పుడే యీ జాతులు అభ్యుదయ పథాన పురోగమించగలుగుతాయి. అప్పుడే ప్రజాస్వామ్యం అంటే యేమిటో చవిచూడ గలుగుతాం. ఈ మహాలక్ష్య సాధనకే మనం కృషిచేయాలి.

సూ: సోవియటు దేశానికీ, మన దేశానికీ హస్తిమశకాంతరం ఉంది. ముందు మనకిప్పుడు బూర్జువాలుకోరే రాష్ట్రంగూడా లేదయ్యె.

అ: వివాదగ్రస్థం గాని జిల్లాలను రాష్ట్రంగా మార్చినంతమాత్రాన మన ప్రజాదుస్థితి తొలగుతుందని నేననుకోను. హైద్రాబాదు సంస్థానాన్ని విభజించి విశాలాంధ్ర స్థాపిస్తారనే ఆశ అసలే లేదు. దానికి ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థే సమూలంగా మారిపోవాలి. బూర్జువా పాలక వర్గాలు ప్రజాసమస్యలను పరిష్కరించలేక పోయినప్పటికీ ముందు సంతతివారికి అనేక జటిల సమస్యలను మిగిల్చిపోతాయి.

రా: ఆ! అది ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు.

అ: అట్లా అని ఊరకుంటే నువ్వే సమస్యనూ పరిష్కరించలేవు. రాష్ట్రసమస్య అంటూ పిలవబడే యీ జాతి సమస్య కేవలం ప్రజా సమస్య. ఈ సమస్యల్ను గూర్చి ప్రజలకు నచ్చ చెప్పండి. వాటివల్ల కలిగే లాభనష్టాలను వారికి విశదీకరించండి. ప్రజాబలం లేకుండా యే సమస్యా పరిష్కారం గాదు. ఎవరో నలుగురు మేధావులు "ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రరాష్ట్రం" అంటూ జపం చేస్తున్న మాత్రాన రాష్ట్రం వస్తుందనుకోవడం పొరపాటు. మేధావులవరకే పరిమితమైన యీ మన రాష్ట్ర సమస్యను ప్రజా సమస్యగా మార్చి, ఆందోళన జరపండి.

పెం: అబ్బాయ్! ఇప్పుడు మనం తగాదా పడ్డవల్ల వచ్చే లాభం యేమీ లేదు. కల్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదని నానుడి. ఆ ఘడియ వచ్చేసరికి అన్ని సమస్యలూ తీరిపోతై గాని రెండాటలేసుకుని పోదాం కూర్చో.

స: ఎన్నికలు గానియ్యండి. తరవాత ఎట్లా ఉంటుందో దేశపరిస్థితి.

రా: మళ్ళీ వీరే గెల్చారా అంటే కొంప నిలువునా ఆరిందన్నమాటే.

సూ: ఆ! యేంటో! యెన్నికలు, ఆంధ్ర రాష్ట్రం! మనకర్మ అనుకోవలసిందే అప్పయ్యా

అ: నిదానం సూరయ్యా! అంత నిరాశ చేసుకుంటే యెట్లా. బూర్జువా సమాజంలో వచ్చే చిక్కులన్నీ యిట్లాగే ఉంటాయి. ఎప్పటికైనా, ఆంధ్రప్రజానీకాన్ని నమ్ముకో. కూర్చో యిహ.


# ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

(షెడ్యూల్డు బ్యాంకు)

స్థాపితము :— 1923

హెడ్డాఫీసు :— మచిలీపట్టణము

చెల్లింప బడిన మూలధనము, రిజర్వులు
రు. 35,00,000 పైబడినది.

అమలునందున్న వ్యాపారము
రు. 6,00,00,000 మించినది.

మద్రాసులో బ్రాంచీలు :

మైలాపూర్ ఆఫీసు : 49, కచ్చేరీ వీధి.

మద్రాసు బ్రాంచి : 378, ఎస్ప్లనేడ్.

త్యాగరాయ నగర్ ఆఫీసు :
81/82 పాండీ బజారు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు.

అనకాపల్లి, చీరాల, ఏలూరు, గుడివాడ గుంటూరు, కాకినాడ, మచిలీపట్నం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తెనాలి, తుని, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, (సిటీ) [illegible]పురం, అరండల్ పేట, (గుంటూరు), బాపట్ల, (గుంటూరుజిల్లా), భీమవరం, గవర్నరుపేట, (విజయవాడ), గూడూరు (నెల్లూరు జిల్లా), పాలకొల్లు.

ఆముదాలవలస (శ్రీకాకుళంజిల్లా), చల్లపల్లి, (కృష్ణాజిల్లా), దుగ్గిరాల, గొల్లప్రోలు, జగ్గయ్యపేట, మహారాణిపేట, (విశాఖపట్నం), పార్వతీపురం, పెడన (కృష్ణాజిల్లా), పెద్దాపురం, రామరావుపేట (కాకినాడ), సాలూరు, సామర్లకోట, తిలారు (శ్రీకాకుళం జిల్లా), తిరుపతి, వినుకొండ, కర్నూలు, నరసన్నపేట, ఇచ్ఛాపురం(శ్రీకాకుళంజిల్లా).

అన్ని విధములైన బ్యాంకింగు వ్యాపారములు, ఫారిన్ ఎక్స్చేంజి సహా కొనసాగింపబడును.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరెక్టర్.

**ఇ. రామచంద్రమూర్తి,**
ఎమ్. ఏ. సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.